జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 11-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 190 పేజీలు: 4 వెల : రూ.7

# ఓబీసీ జాబితాపై.. చర్చ



* ఈ ప్రక్రియ వేగవంతం చేయండి * పూండి రైల్వే స్టేషన్, బెండి గేటు అంశంపై కూడా.. * కేంద్ర మంత్రులను కోరిన విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

**శ్రీకాకుళం, డిసెంబర్ 10 (వార్త):** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉత్తరాంధ్ర లోని తూర్పుకాపు, కళింగవైశ్య, శిష్టకరణ, సొండి, అరవ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. దీనిపై గత పదేళ్లుగా పార్లమెంటులో, ఎన్సీబీసీ కమిషన్‌లో పోరాడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ మేరకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషలతో కలిసి కేంద్ర సామాజిక, న్యాయ శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్‌ను ఢిల్లీలో



మంగళవారం కలుసుకున్నారు. తూర్పుకాపు, కళింగవైశ్య, శిష్టకరణ, సొండి, అరవ కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాల్సిన ఆవశ్యకతను ఆయనకు వివరించారు. దీనిపై గతంలో ఎన్సీబీసీ చైర్మన్ గంగారాం ఆహిర్ ఆధ్వర్యంలో 5. సామాజిక వర్గాలకు చెందిన ప్రతినిధులతో సామాజిక వేదిక నిర్వహించామని తెలిపారు. ఈ అంశంపై తాను పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైనప్పటి నుంచి డిమాండ్ చేస్తున్నామని, దీనిని ప్రాధాన్యతగా గుర్తించడంతో పాటు త్వరితగతిన రిజిస్ట్రేషన్ అమలయ్యేలా చూడాలని విన్నవించారు.

**రైల్వే మంత్రి దృష్టికి పలు సమస్యలు..**

శ్రీకాకుళం జిల్లాలో అత్యంత ప్రాధాన్యమైన ఉద్దానంలో ఉన్న పూండి రైల్వే స్టేషన్ లో మౌలిక వసతులు కల్పించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ ను కలుసుకున్నారు. కరోనా ముందు పూండిలో భువనేశ్వర్ - సికింద్రాబాద్ (విశాఖ ఎక్స్ ప్రెస్), భువనేశ్వర్ - బెంగళూరు (ప్రశాంతి ఎక్స్ ప్రెస్), పూరీ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల చేసే వారని గుర్తు చేశారు. వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ప్రజలు ఈ స్టేషన్‌పైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు. ప్రాధాన్యతను గుర్తించి, ఆయా రైళ్ల నిలుపుదలను పున: ప్రారంభించాలని కోరారు. అలాగే పూండి రైల్వే స్టేషన్ లో తాగునీరు, ప్రయాణికుల విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు, రిజల్యూషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దీనితో పాటు నత్తనడకన సాగుతున్న బెండి గేటు ఫ్లై ఓవర్ పనులను వేగవంతం చేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకు రావాలని వివరించారు. కాశీబుగ్గ ఎల్సీ గేటు వద్ద నిలిచిపోయిన రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. గత కొంతకాలంగా ఆ పనులు ముందుకుసాగడం లేదన్నారు. ఆర్ఓబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. వారితో పాటు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు మహిళలు అదృశ్యం

**ఇచ్ఛాపురం, డిసెంబర్10 (వార్త):** ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. వీటిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా అందింది. వివరాల్లోకి వెళితే.. రత్తకన్న కాలనీకి చెందిన కాటిల రీటా రెడ్డికి శేఖర్ రెడ్డి అనే వ్యక్తితో 2017లో వివాహమైంది. భర్త దుబాయ్ లో వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడు. తల్లి కరిగి మోహినితో రీటారెడ్డి నివసిస్తోంది. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి చూసుకునేసరికి రీతారెడ్డి ఇంట్లో లేనట్టు ఆమె తల్లి గమనించి ఫిర్యాదు చేసిందని ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ చిన్నం నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే తోటవీధికి చెందిన దుర్గాసి మాధవి (20) కూడా అదృశ్యమైనట్టు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందింది. 2019 నుంచి మతిస్థిమితం లేక విశాఖపట్నంలో ఉన్న మెంటల్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటోంది. ఆమె తల్లి తులసమ్మతో కలిసి నివసిస్తోంది. ఈనెల 3న బయటకు వెళ్లిన ఆమె ఇంటికి రాలేదని తల్లి వాపోయింది. 2022లో కూడా ఒకసారి అలానే వెళ్లిపోయి మూడు రోజుల తర్వాత తిరిగి వచ్చింది. ఇప్పుడు కూడా అలానే వస్తుందేమో అని తల్లి ఎదురుచూసింది. మంగళవారం రెంటకోట గ్రామానికి చెందిన గిడగ మమతతో కలిసి మాదవి అదృశ్యంపై ఫిర్యాదు చేసినట్టు ఇచ్ఛాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## రేషన్ డిపోపై విజిలెన్స్ దాడి

* రాణిగాం రేషన్ డిపో సీజ్ * డీలర్‌పై 6 ఏ కేసు

**సోంపేట, డిసెంబర్ 10 (వార్త):** సోంపేట మండలం తాళ్లభద్ర పంచాయతీ పరిధిలోని రాణిగాం గ్రామానికి చెందిన డీలర్ బంగారు మాధవయ్య నడిపిస్తున్న రేషన్ దుకాణంపై విజిలెన్స్ అధికారులు మంగళవారం రాత్రి దాడులు జరిపి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ డిపోలో ఉన్న 79 కేజీల బియ్యం, కందిపప్పు 12 ప్యాకెట్లు, పంచదార 22 ప్యాకెట్లు, ఫామ్ ఆయిల్ 11 1/2 ప్యాకెట్లు తేడాగా వున్నట్లు గుర్తించారు. సదరు షాప్‌లో వున్న సరుకు సీజ్ చేశారు. ఈపాస్, కాటా పక్కన ఉన్న తాళ్లభద్ర డీలర్‌కి అప్పగించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రామారావు, ఈశ్వరరావు, లక్షణరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి.కిరణ్ కుమార్, వీఆర్వో తిరుపతి పాల్గొన్నారు. డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసి అధికారులకు నివేదిక పంపిస్తున్నామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. రేషన్ డిపో సీజ్‌పై మండలంలోని పలువురు డీలర్లు ఆందోళనకు గురయ్యారు.



## కూటమి ప్రభుత్వంలో.. రైతులకు అన్యాయం

* రైస్ మిల్లర్లతో మంత్రి ములాఖాత్
* ఏసీకేల పేరుతో దోపిడీకియత్నం
* ఆర్‌బీకేలను నిర్వీర్యం చేశారు
* రైతుల పక్షాన ఉద్యమిస్తాం
* ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
* తలగాంలో ధాన్యం కుప్పల పరిశీలన

**టెక్కలి/సంతబొమ్మాళి, డిసెంబర్ 10 (వార్త):** ధాన్యం కొనుగోలులో ఈ కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టెక్కలి మండలం తలగాం సమీపంలో పంట పొలాల్లో వరి కోతలు, ధాన్యం కుప్పలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండగా కేవలం ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేస్తామని మంత్రులు, అధికారులు చెప్పడం రైతులకు అన్యాయం చేయడమేనన్నారు. ఏసీకేల పేరుతో కోట్లాది రూపాయలు దోపిడీకి పాల్పడుతున్నారని తెలిపారు. జిల్లాలో రైస్ మిల్లర్లతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు ములాఖాత్ అయ్యారన్నారు. హరివరప్రసాద్ అడ్డాలో ఉన్న ఎఫ్‌సీఐ గొడౌన్‌కు అడ్డదారిలో సుమారు 3.30 లక్షల టన్నుల బియ్యం కట్టబెట్టడానికి ప్లాన్ వేసుకున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. గత ప్రభుత్వంలో రైతులకు అండగా ఉన్న ఆర్‌బీకేలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. రైతు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేకుంటే వారి పక్షాన ఉద్యమిస్తామని దువ్వాడ హెచ్చరించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ పి.రమేష్, సర్పంచ్‌లు ఎస్.బాలకృష్ణ, పి.లక్ష్మి, నాయకులు ఆర్.ఆంజనేయులు, ఎస్.మోహన్, సీహెచ్ చిన్నారావు, వి.గోపాలకృష్ణ, యు.విశ్వనాథం ఉన్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**పోలాకి, డిసెంబర్ 10(వార్త):** మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలాకి ఎస్ఐ రంజిత్‌కుమార్ ..విద్యార్థులకు సూచించారు. మంగళవారం ఆయన పోలాకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి స్నేహితులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. విద్య ద్వారా విద్యార్థులందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాకు గరిమెళ్ల పేరు పెట్టాలి




**పోలాకి, డిసెంబర్ 10(వార్త):** స్వాతంత్ర్య సమర భేరికి తన పాటలు, పద్యాలు, గేయాలతో పోరుబాటకే గరిమెళ్ల ప్రాముఖ్యత ఇచ్చారని అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు, కవి, రచయిత, సీనియర్ పాత్రికేయులు నల్లి ధర్మారావు అన్నారు. మంగళవారం ఆయన ప్రియాగ్రహారంలోని గరిమెళ్ల కళావేదికలో ప్రగతి సాహితి సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు ఇలపండ గణపతిరావు అధ్యక్షతన జరిగిన గరిమెళ్ల కవితా స్రవంతి పుస్తకావిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గురజాడకు ఘనమైన వారసుడు గరిమెళ్ల సత్యనారాయణ అని చెప్పారు. శరీరం లేక పోయినా జ్ఞాపకాలు గుర్తుంటాయని, చదువుతూనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గరిమెళ్ల పేరు శ్రీకాకుళం జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా అరసం జిల్లా కార్యదర్శి రత్నాల బాలకృష్ణ మాట్లాడుతూ గురజాడను గుర్తించింది గరిమెళ్ల సత్యనారాయణ అని గుర్తు చేశారు. గరిమెళ్ల డిగ్రీ చదువుతుండగానే మాకొద్దీ తెల్ల దొరతనం పాట రచించారన్నారు. పాటలు, నాటకాల ద్వారా ప్రజల్లో విప్లవ ఉద్యమం రావాలని గరిమెళ్ల ఆకాంక్షించినట్లు తెలిపారు. గరిమెళ్ల జైలులోనే అనేక రచనలు చేసినట్లు చెప్పారు. గరిమెళ్లను రాష్ట్రస్థాయిలో గుర్తించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం అధ్యక్షులు బద్రి కుర్మారావు మాట్లా డుతూ జనంను మైమరిపించేది ఉత్తేజపరిచేది జాన పదమని అన్నారు. గరిమెళ్ల పుట్టిన ప్రియాగ్రహారంలో పుట్టిన ప్రతి ఒక్కరూ ధన్యజీవులన్నారు. విజయనగరం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ జి.జయపాలరావు మాట్లాడుతూ గరిమెళ్ల పాటలతో స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి పొందిన వారెందరో ఉన్నారన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా ఉద్యమాలకు గరిమెళ్ల స్ఫూర్తి అన్నారు. ఏపీడబ్ల్యూజేయూ నేత ఎన్.ఈశ్వరరావు మాట్లాడుతూ గరిమెళ్ల జయంతి, వర్ధంతులు ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ నేటితరం మరచిపోయిన జాతి రత్నం గరిమెళ్ల అని అన్నారు. ఆయన పేరిట ప్రియగ్రహారంలో శాఖా గ్రంథాలయం మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇలపండ గణపతిరావు పాడిన మాకొద్దీ తెల్లదొరతనంతో పాటు మరికొన్ని పాటలను అందరూ ప్రశంసించారు. బాలకృష్ణ సంపాదకత్వంలో ప్రచురించిన గరిమెళ్ల కవితా స్రవంతిని స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.నాగకుమారి ఆవిష్కరించారు. ప్రముఖ సాహితీవేత్త నల్లి ధర్మారావు రచించిన మాకొద్దీ తెల్లదొరతనం నాటికను స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వేశ్వరరావు పరిచయం చేశారు.

కార్యక్రమంలో చింతాడ కృష్ణారావు, ఇస్కాప్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ మల్లేశ్వరరావు, రాగుపాటి నారాయణమూర్తి, పి.మహేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు నాగేంద్రశర్మ, ధనుంజయ, కె.లక్ష్మీరాజమోహిని, ఉపాధ్యాయులు పి.గౌరీశంకర్, శివప్రసాద్, జీఎన్ మూర్తి, కె.గోపి, కోరాడ పెంటయ్య, దుబ్బ కోటేశ్వరరావు, సాహితీవేత్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**శ్రీకాకుళం, డిసెంబర్ 10(వార్త):** భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కిష్టప్పపేటలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆక్రమణలు, ఫ్రీహోల్డ్, మ్యుటేషన్, 22 ఏ, డీకేట్, రీసర్వే, ఇతర రెవెన్యూ సంబంధిత అంశాలపై వినతులు స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రద్దు చేసినట్లు వివరించారు. ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరించాలన్నదే మీ భూమి మీ హక్కు రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రజల నుంచి వినతులను అధికారులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో భూ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి



సారించిందని వివరించారు. ప్రజా సంస్కరణలను దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నారని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# హక్కులకు భంగం కలిగితే కోర్టును ఆశ్రయించండి




**శ్రీకాకుళం, డిసెంబర్ 10(వార్త):** మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా నైరా వ్యవసాయ కళాశాలలో మంగళవారం జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికారి ఆర్.సన్యాసినాయుడు మాట్లాడుతూ స్వేచ్ఛగా స్వతంత్రంగా.. బతకడం ప్రతి మనిషి జన్మ హక్కు అని తెలిపారు. ప్రతి మనిషి స్వేచ్ఛని గౌరవించాలని సూచించారు. హక్కులకు భంగం కలిగితే 1వ అదనపు జిల్లా కోర్టును ఆశ్రయించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. పేదవారు, మహిళలు, అంగ వైకల్యం కలిగిన వారు, వయో వృద్ధులకు అందిస్తున్న మెరుగైన సేవలను గూర్చి తెలిపారు.

కార్యక్రమంలో జి. ఇంది రాప్రసాద్, అడ్వకేట్ డి.చిన్నంనాయుడు, వి.శ్రీనివాస్, డి.అనిల్‌కుమార్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సొండిపూడి విద్యార్థినుల ప్రతిభ

**మందస, డిసెంబర్ 10(వార్త):** మందస మండలంలోని సొండిపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని డొక్కరి మాధవి ప్రతిభ చూపింది. ఈనెల 6న రాష్ట్రవ్యాప్తంగా హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన కౌశల్ ప్రతిభా పరీక్ష ఫలితాల్లో ఆమె మొదటి ర్యాంక్ సాధించింది. ఈ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. మాధవి రీల్స్ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించగా, అదే పాఠశాలకు చెందిన భాగ్యలక్ష్మి పాణిగ్రాహి(10వ తరగతి) క్విజ్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. జిల్లాకే గర్వకారణంగా నిలిచిన ఈ చిన్నారులను జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్.తిరుమలచైతన్య, ఉప విద్యాశాఖ అధికారి పి.విలియమ్స్, ఎంఈవోలు ఎం.లక్ష్మణరావు, ఎం.భాస్కరరావు, సర్పంచ్ నళిని శ్రీనివాస్, ఎస్.ఎం.సి చైర్ పర్సన్ తలగాన మాకమ్మమహేష్, ఎంపీటీసీ ప్రతినిధి దడ్డ కిరణ్ కుమార్, విద్యా కమిటీ మెంబర్స్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సాల్మన్, సిబ్బంది అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్ మాట్లాడుతూ ఈ చిన్నారులు రాష్ట్రస్థాయిలో పాఠశాల గౌరవాన్ని ఉన్నతంగా నిలబెట్టారని ప్రశంసించారు.

## వసతిగృహాల పరిశీలన



**శ్రీకాకుళం, డిసెంబర్ 10(వార్త):** వసతిగృహాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. మంగళవారం రణస్థలం ప్రభుత్వ కళాశాల నందు గల బీసీ విద్యార్థినీ, విద్యార్థుల వసతిగృహాలను పరిశీలించారు. పారిశుధ్యం, పరిశుభ్రత, మౌలిక వసతులు ఆహార సదుపాయాలు గురించి విద్యార్థులను ఆరా తీశారు. పిల్లల విషయంలో శ్రద్ధ చూపాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

## బీమా పథకాలపై అవగాహన

**- నరసన్నపేట ఎల్.ఐ.సీ. సీనియర్ బ్రాంచి మేనేజర్ నేతాజీ**

**- ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో విద్యార్థుల క్షేత్ర స్థాయి సందర్శన**

**నరసన్నపేట, డిసెంబర్ 10(వార్త):** అనిశ్చిత సమాజంలో జీవితబీమా అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని ఎల్ఐసీ నరసన్నపేట సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎం.నేతాజీ అన్నారు. జీవితానికి రక్షణ కల్పించడానికి ఎల్.ఐ.సీ. ప్రజలకు ఎంతో సహాయం చేస్తోందని తెలిపారు. ఆన్ ది జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు మంగళవారం ఆయన ఎల్ఐసీ కార్యకలాపాలపై అవగాహన కల్పించారు. జీవితబీమా పాలసీలు, సరెండర్ విలువ లెక్కించడం, బీమా క్లైములు విభాగం పనితీరు, అకౌంట్స్ విభాగం, సామాజిక బాధ్యత కింద సంస్థ అందిస్తున్న సబ్సిడీలు తదితర అంశాలను వివరించారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచనలతో, డీవీఈవో తవిటినాయుడు ఆదేశాల ప్రకారం ఒకేషనల్ విద్యార్థులకు ఎల్ఐసీలో ఒకరోజు ఓజేటీ కార్యక్రమం నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు.



## హరిపురంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

**మందస, డిసెంబర్ 10(వార్త):** హరిపురంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గాయత్రి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొర్ల కన్నారావు ఆధ్వ ర్యంలో హరిపురం మెయిన్ రోడ్డులో విశాఖపట్నానికి చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు 100 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. 18మందికి ఆపరేషన్లకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మార్పు వెంకటేశం, కొంచాడ సురేష్, ముడిమించి మధు బాబు, ఉగ్రపల్లి మోహనరావు, ఎం.సురేష్, ఇప్పిలి వెంకటరావు, క్యాంప్ కోఆర్డినేటర్ ఆర్.స్వాములు, సాయి, సమీర్, భాగ్యలక్ష్మి, గీతాశ్రీ తదితరులు పాల్గొన్నారు.






## జిల్లా స్థాయిలో కొత్తపల్లి విద్యార్థుల సత్తా

**మందస, డిసెంబర్ 10(వార్త):** జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని సిక్కోలు గణిత ఉపాధ్యాయుల వేదిక ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షల్లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతి విభాగం నుంచి నెయ్యల భార్గవి జిల్లా స్థాయిలో 8వ ర్యాంక్, 10వ తరగతి విభాగం నుంచి పైల కీర్తన జిల్లా స్థాయిలో 12వ ర్యాంక్ సాధించారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు యస్.గణేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న జిల్లా కేంద్రంగా జరిగే గణిత దినోత్సవంలో వీరికి బహుమతి ప్రదానం చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులకు చిరు కానుకలు అందిస్తూ ప్రత్యేకంగా అభినందించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన స్థానిక గణిత ఉపాధ్యాయులు గవ్వ భీమారావుని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యం.లక్ష్మణరావు, యస్.కిరణ్‌కుమార్, యస్.అబ్రహం, పి.రాంబాబు, యం.చిత్రసేను, యం.దామోదరం, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి యస్.ఈశ్వరరావు, ఇతర పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ సంఘానికి పొదుపులు కట్టించండి



**వంగర, డిసెంబర్ 10(వార్త):** ఏస్‌హెచ్‌జీ గ్రూపుల నుంచి గ్రామ సంఘానికి పొదుపులు కట్టించేటట్లు చర్యలు తీసుకోవాలని వెలుగు ఏపీఎం టి.మంగమ్మ సూచించారు. మంగళవారం ఆమె మండల సమాఖ్య కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత గల సంఘాలకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్త్రీ నిధి, సీఐఎఫ్, హెచ్‌డీఐఎఫ్ ఉన్నతికి రుణాలు సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. ఇన్‌కం ప్రొఫైల్ సర్వే వేగవంతం చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో లోపింటి త్రినాథరావు, ఏపీఎం మంగమ్మ ఆధ్వర్యంలో సమాఖ్య కార్యాలయ ఆవరణలో జెండర్ అధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ, మానవహారం.. గ్రూపు సభ్యులు చేపట్టారు. సమావేశానికి మండల సమాఖ్య అధ్యక్షురాలు బెవర రామలక్ష్మి, ఈసీ మెంబర్స్, సీసీలు, వీఓఏలు హాజరయ్యారు.

## ఒలింపియాడ్స్ విజేతలకు పతకాలు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 10(వార్త):**జాతీయస్థాయి హమ్మింగ్ బర్డ్ ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన జ్ఞానభారతి పాఠశాల విద్యార్థులకు మంగళవారం జ్ఞానభారతి ట్రస్ట్ సీఈవో కార్యదర్శి జోహార్‌ఖాన్ పతకాలను, ధ్రువపత్రాలను అందించారు. 2023 -24 విద్యా సంవత్సరానికి హమ్మింగ్ బర్డ్ ఒలింపియాడ్ మాథ్స్, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు పరీక్షలను నిర్వహించింది. జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 91 మంది విద్యార్థులకు ఒలింపియాడ్ నిర్వాహకులు బంగారు, వెండి, రజత పతకాలను, ధ్రువపత్రాలను పాఠశాలకు అందించారు. ఈ పతకాలను, ధ్రువ పత్రాలను అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాలలో నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు జ్ఞానభారతి కార్యదర్శి, సీఈవో జోహార్ ఖాన్ పతకాలను, ధ్రువపత్రాలను అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదాసుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిణి సయ్యదా సుల్తానా, ట్రాన్స్ పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, పీఈటీ కైలాస్ కుమార్ పండా తదితరులు పాల్గొన్నారు.



# సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**నరసన్నపేట, డిసెంబర్ 10(వార్త):** భూసమస్యలన్నీ పరిష్కరించడానికే ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు.

మంగళవారం ఆయన మడపాం గ్రామంలో నిర్వహించిన మీ భూమి- మీ హక్కు రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల భూ సమస్యలన్నీ పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. క్రమశిక్షణతో పని చేస్తే ఎవరికీ సమస్యలు ఉండవన్నారు.

వీఆర్వోలు భూముల వివరాలు ఎప్పటికప్పుడు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. సదస్సులో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. మీ సమస్య పరిష్కరించడం జరిగిందా లేదా మీ సెల్ ఫోన్‌కి కచ్చితంగా మెసేజ్ ద్వారా తెలియజేస్తామ న్నారు. గ్రామ రెవెన్యూ అధికారులంతా రెవెన్యూ సదస్సులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రజలు నేరుగా వచ్చి తమ వినతిపత్రాల ద్వారా రికార్డులలో పరిస్థితిని తెలుసుకోవచ్చన్నారు. సదస్సుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంద న్నారు.

సదస్సులో టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అడపా చంద్రశేఖర్, రావాడ కృష్ణ, సర్పంచులు రాపర్తి ఎరుకువాడు, చింతు రాజన్న, గొద్దు సుందరరావు, చింతు మల్లేశ్వరరావు, దిలీప్, సింహాచలం, తహసీల్దార్, ఎంపీడీవో, మండల స్పెషల్ ఆఫీసర్, మండల సర్వేయర్, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటి సంఘాల ఎన్నికలపై ఎమ్మెల్యే సమీక్ష



**పాతపట్నం, డిసెంబర్ 10(వార్త):** పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి నీటి సంఘాల ఎన్నికలు, నోటిఫికేషన్, నిర్వహణపై ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ నీటి సంఘాలు 24కు టీసీలు 426, మేజర్ సంఘాలు ఐదుకు టీసీలు 60 ఉన్నాయన్నారు. వీటికి ఎన్నికలు సజావుగా నిర్వహించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ పాలనలో సరైన కేటాయింపులు లేక సాగునీటి సరఫరా వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పోస్ట్‌కార్డు ఉద్యమం

**సోంపేట, డిసెంబర్ 10(వార్త):** ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితం, ఆత్మార్పణలు దీర్ఘకాల పోరాటంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి పూనుకోవడం మంచిది కాదని బీసీ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం సోంపేటలో ప్రధానికి వెయ్యి పోస్ట్ కార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భగసదా ఆ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కేంద్రం గౌరవించాలని కోరారు. ఎన్నికల వాగ్దానాల్లో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని ప్రకటనలు చేశారని, కొత్త ఉద్యోగాలు ఇస్తారో లేదో కానీ ఉన్న వాటిని తీసేయొద్దని విన్నవించారు. తెన్నేటి విశ్వనాథం లాంటి మహానుభావులెందరో త్యాగాల ఫలితం గా ఏర్పడిన ఉక్కు ఫ్యాక్టరీని, ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే పోస్ట్ కార్డులు ఉద్యమం చేపట్టామన్నారు. తమ బాధ్యతగా వెయ్యి పోస్ట్‌కార్డులు ఈ ప్రాంతం నుంచి ప్రధాన మంత్రికి పంపించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కొన్ని కార్డులు బారువ నుంచి ప్రజాస్వామ్య వాదులతో విద్యార్థులతో రాయించి పోస్ట్ బాక్స్‌లో వేశారు.



కార్య క్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, బీసీ నాయకులు గేదెల దేవరాజ్, పల్లి హరిచంద్ర, ఇర్రోతు శ్రీనివాస్, నాయని యాదవరావు, గేదెల సుజాత, ఎ.కామేశ్వరరావు, గేదెల విజయ, తెప్పల కోటేశ్వరి, తెరికోటి కృష్ణవేణి, తోట యోగి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పోలీస్ కుటుంబానికి ఆర్థికసాయం

**పలాస, డిసెంబర్ 10(వార్త):** ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ.. మృతి చెందిన పలాస మండలం దానగోర గ్రామానికి చెందిన ఎన్.జోక్యో కుటుంబానికి జిల్లా పోలీస్ డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి లక్ష రూపాయలు మంగళవారం అందజేశారు. ఆయన భార్య మేరికి ఈ మేరకు చెక్‌ను అందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు, ట్రెజరర్ కె.భుజంగరావు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



# అచ్చెన్న చొరవతో టెక్కలిలో మినీ రైతుబజార్

**టెక్కలి, డిసెంబర్ 10(వార్త):** మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో టెక్కలిలో మినీ రైతుబజార్ ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బందిపడుతున్న తోపుడు బళ్ల వ్యాపారులకు చిన్నబజార్‌లో గల పశువుల హాస్పిటల్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వ్యాపారాలకు అవకాశం కల్పించారు. ఈ స్థలాన్ని మంగళవారం పంచాయతీ ఈవో కేవీవీ జగన్నాథం, టెక్కలి సబ్ ఇన్‌స్పెక్టర్ రాము ఆధ్వర్యంలో శుభ్రపరిచారు. అనంతరం సుమారు 50మందికి ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడికి ఎంతో రుణపడి ఉంటామని వారు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనంగా అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 10(వార్త):** హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రెసిడెంట్ డి.కృష్ణమూర్తి రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడి మాట్లాడుతూ మానవ హక్కుల గురించి వివరించారు. ఇలాంటి కార్యక్రమం చేసినందుకు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్వర్ణ భారతి జూనియర్, డిగ్రీ కళాశాల, ఆదిత్య, డిగ్రీ జూనియర్ కళాశాలల విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకర రావు, ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సదయ్య, హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజవర్గ సెక్రటరీ ఎం.రాం బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోట రామారావు, అసిస్టెంట్ ఎడ్యుకేషనల్ సెక్రటరీ కే.సి.పూరి, అసిస్టెంట్ సెక్రటరీ డి.తులసీరావు పాల్గొన్నారు.

# నీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిపించాలి



**పలాస, డిసెంబర్ 10(వార్త):** శాంతి భద్రతలకు విఘాతం లేకుండా నీటి సంఘాల ఎన్నికలు సజావుగా జరిపించాలని తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి అన్నారు. ఈనెల 14న నీటి సంఘాల ఎన్నికల దృష్ట్యా ఎన్నికల అధికారులకు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంఘాలలో మేజర్ సంఘాలకు 12 టీసీలు, మైనర్ సంఘాలలో ఆరు టీసీ ఉంటారన్నారు. సభ్యులందరూ కలసి ఒక్కో టి.సిని గెలిపించుకోగా, టీసీలందరూ కలసి నీటి సంఘాల అధ్యక్షులను ఎన్నుకుంటారన్నారు. ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థుల్లో నీటి తీరువా పన్నులు బకాయిలు ఉన్న వారిని అనర్హులుగా ప్రకటించాలని సూచించారు. ఎన్నికలు ఏకగ్రీవం జరిగేలా చూడాలన్నారు. ఏకగ్రీవం జరిగిన సంఘాలకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. అదే రోజు ఎన్నికలు ఫలితాలను ఎన్నికల అధికారి ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల శిక్షణ అధికారి బాబ్జీ, పలాస ఎంపీడీవో వసంతకుమార్, ఎలక్షన్ డీటీ గిరి పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో అనర్థాలపై అవగాహన

**టెక్కలి, డిసెంబర్ 10(వార్త):** టెక్కలిలోని మదర్‌థెరిస్సా జూనియర్ కాలేజీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్కలి ఎస్ఐ కె.రాము మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఏబీవీపీ నేత ఆనందరావు మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమైపోతుందన్నారు. టెక్కలి ఏబీవీపీ నేత కొన్ని మురళి మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొన్ని వెంకట్రావు, కళాశాల డైరెక్టర్ ఎండ ముకుంద రావు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సిగిలిపల్లి మదన్ కుమార్, నరసన్నపేట మండల కన్వీనర్ జశ్వంత్, చరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రైల్వే మంత్రి దృష్టికి ఆర్‌వోబీ సమస్య

**పలాస, డిసెంబర్ 10(వార్త):** పలాస-కాశీబుగ్గ ఎల్సీ గేటు వద్ద నిలిచిపోయిన రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు ఆమె మంగళవారం కలిశారు. పనుల తీరును ఆయనకు వివరించారు. ట్రైన్ ట్రాఫిక్‌తో అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు నిలిచిపోతున్నాయని, ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటున్నాయని వివరించారు. ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. దీనిపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు.

## క్రిస్మస్ సందడి ప్రారంభం

**పలాస, డిసెంబర్ 10(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలో పలు చర్చిల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. కాశీబుగ్గ పల్లి వీధిలో గల జేఎస్ఎంబీ చర్చిలో మహిళలు మంగళవారం క్రిస్మస్ కట్ చేశారు. కార్యక్రమంలో కృపారాణి, కార్యదర్శి కమల, ట్రజరర్ మార్తమ్మ, నిర్మల, విజయ, బాలశ్రీ, జ్యోతి పాల్, రిబ్కా రమేష్, ఆశ పాల్, జ్యోతి సురేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత లోపిస్తే సహించను



**పలాస, డిసెంబర్ 10(వార్త):** కాశీబుగ్గ బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆకస్మాత్తుగా సందర్శించి, క్యాంటీన్ నిర్వహణ, పారిశుధ్యం, ఆహార నాణ్యతను నిశితంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, రుచులను అక్కడ భోజనం చేస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లోపిస్తే సహించేంది లేదని నిర్వాహకులకు స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సిబ్బందికి ఆదేశించారు.

## యువకుడి వైద్యానికి ఆర్థికసాయమందించండి

**టెక్కలి, డిసెంబర్ 10(వార్త):** టెక్కలిలోని ఆదిఆంధ్రా వీధికి చెందిన సాయి కుమార్ చేతిలో నాటుబాంబు పేలడంతో రెండు చేతుల వేళ్లు పూర్తిగా తెగిపోయాయి. దీతో ఆయనను శ్రీకాకుళం రిమ్స్ కి తరలించారు. అక్కడ కూడా పరిశీలించిన వైద్యులు వెంటనే కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడ వైద్యులు ఆపరేషన్ చేసి ఐదు వేళ్లు తొలగించారు. ఆయన తండ్రి ఓ రిక్షా కార్మికుడు. రెక్కాడితే గాని డొక్కాడని ఈ నిరుపేద కుటుంబం. దీంతో వారు దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. దిక్కుతోచని పరిస్థితుల్లో టెక్కలి అభయం సేవా సంఘంకి కాల్ చేసి సాయం కోరారు. దాతలు కరుణించాలని వారు కోరుతున్నారు. టెక్కలి అభయం యువజన సేవా సంఘం ఫోన్ పే నెంబర్ 9441116108కు దాతలు విరాళాలు ఇవ్వాలని వారు అభ్యర్థిస్తున్నారు.



Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546